# వరల్డ్ రికార్డ్!

గిన్నీస్‌బుక్‌లో కెక్కిన ఘరానా గజదొంగ! చోరీలు చేయటంలో నిష్ణాతుడు.. తాళాలు అవలీలగా విరగ్గొట్టటంలో అందెవేసిన చేయి.. బేంకు రాబరీలకు పెట్టింది పేరు. ఇంకా ఎన్నెన్నో అనర్థాలకు కారకుడైన వాడు భారతీయుడు కావటం అందరికీ గర్వకారణం.

అన్ని భారతీయ భాషలలో వెలువడే దిన పత్రికలన్నీ పై వార్తను ప్రముఖంగా ప్రచురించినయ్.

వివరాల్లోకి వెళితే...

చిన్న తనంలో స్కూలుకు వెల్లనని మొండికేసి మోరాయించిన వాడు రసూల్! అమ్మానాన్న బలవంతాన ఈడ్చుకెళ్లి రసూల్‌ని బడిలో దించి వచ్చినా.. అతని మనసు చదువు మీద లగ్నం అయ్యేది కాదు? టీచర్‌కి చెప్పకుండా పలక బలపం విసిరేసి ఎంచక్కా స్వేచ్ఛా విహంగంలా వీధుల వెంట తిరిగేవాడు. స్వతంత్ర వాయువులను పీలుస్తూ జాలీగ బ్రతకాలనే ఆరాటం రసూల్ పసిమనసులో బలంగా నాటుకు పోయింది!

రసూల్‌తండ్రి అఫ్రిదీ కారు షెడ్‌లో మెటారు మెకానిక్ చేస్తూ నలుగురి భార్యలను డజను మంది సంతానాన్ని పోషించలేక నానా యాతన పడుతున్న మనిషి!

ఆడ పిల్లల నలుగురికీ యుక్త వయసు రాగానే పెళ్లిళ్లు చేయలేక కాళ్లు బార చాపినపుడు అరబ్ షేకులు అతగాడి మనసులో మెదలటంతో తన అదృష్టం పండిందనుకుని షేకులను ఆశ్రయించి వారి వద్ద నుండి ఎదురు డబ్బు గుంజి ఆడపిల్లలను వారితో పంపేసి చేతులు దులుపుకున్న ఘనుడు అఫ్రీదీ!

కూతుళ్లు దుబాయ్‌లో వున్నారంటూ గర్వంగా చెప్పుకుంటూ వచ్చాడు. గడపదాటి వెళ్లిన కూతుళ్లు మళ్లీ అఫ్రీది ఇంటి ముఖం చూచిన పాపాన పోలేదు.

మగ పిల్లల్లో మూడోవాడు రసూల్! పెద్దపిల్లాడిని టైలరింగ్ షాప్‌లో వుంచాడు. రెండో వాడిని పెట్రోలు బంక్‌లో పెట్టాడు. వాళ్లిద్దరూ తెచ్చే వందో రెండువందలో తన సంపాదనకుతోడై ఇల్లు కుంటి నడక నడుస్తున్నందుకు ఎక్కడో తృప్తి మిగిలింది. అఫ్రిదీ మనసులో...

మూడో పిల్లాడు రసూల్ నైనా చదివించాలని బళ్లో వేసినా వాడికి చదువు అబ్బేట్టు లేదనే నిజాన్ని ఆలస్యంగా గ్రహించాడు.

ఏం చేస్తాం. అల్లా దయ లేదు అనుకోవటం తప్పించి వాడిని మంచి మార్గంలో పెట్టే బాద్యత తండ్రిగా తన భుజాల మీద వేసుకోలేక పోయాడు.

ఇక లాభం లేదనుకుని రసూల్‌ని తనకు తెలిసినొక సైకిల్ షాపులో పెట్టాడు. వీడు

కూడా నెలకో వంద రూపాయలు తెచ్చి తన చేతిలో పెడుతూండటంతో మరికొంచెం వూపిరి పీల్చుకున్నట్టన్పించింది అఫ్రిదీకి!

బీడీలు వూదాలన్నా... చాయ్ తాగాలన్నా తండ్రి రసూల్ చేతికి కనీసం రోజుకో రూపాయన్నా ఇవ్వక పోవటంతో ఏం చేయటమాని ప్లానేసి ఓనర్ కొట్లో లేనప్పుడు సైకిళ్లకి గాలి కొట్టిన తాలూకు వచ్చే చిల్లర జేబులో వేసుకుని అవసరాలు తీర్చుకోవటం ప్రారంభించాడు.

ఈ విషయం పసిగట్టిన సైకిల్ షాపు ఓనరు రసూల్‌ని పన్లోకి రావద్దన్నాడు. అఫ్రిదీకి ఈ విషయం తెలిసి రసూల్ వీపు చీరేసాడు. మెడపట్టుకు ఇంట్లోంచి వీధిలోకి గెంటేసాడు. మళ్లీ ఇంటి గడపతొక్కితే గొంతు పిసికి హుసేన్ సాగర్లో పడేస్తానన్నాడు.

కన్నతల్లి మనసు కలత చెందినా మొగుడి నిర్ణయానికి ఎదురు చెప్పలేకపోయింది.

రసూల్ జీవితం పసితనంలోనే వీధిన పడింది. ఖాళీ చేతులు... కాలేకడుపుతో ఇరానీ హోటల్ ముందు నిలుచున్న రసూల్‌ని చూచి జాలిపడి ప్లేట్లు గ్లాసులు కడిగే పనిచ్చాడు ఓనరు!

ఇరానీ హోటల్లో పనికి కుదిరేక తిండికి లోటు లేకుండా జరుగుతోంది. రోజూ బిర్యానీ కడుపునిండా తింటున్నాడు రసూల్.నెల పూర్తికాగానే జీతం కోసం చేయి చాచేవాడు. డబ్బులు ఇవ్వక పోగా రసూల్ అడిగినందుకు అరచేతిలో అట్లకాడతో వాత పెట్టి మరీ బైటికి నెట్టేసాడు ఓనరు.

చేసే పని పోయింది. బతుకు మళ్లీ రోడ్డున పడింది. పైగా అరచేతిలో వాతొకటి. వాత పెట్టిన క్షణంలో రసూల్ ప్రాణం అల్లాడింది. 'అల్లా' గుర్తొచ్చాడు. ధర్మాసుపత్రికెళ్లి మందేయించుకుని కట్టు కట్టించుకున్నాడు. బాధ తగ్గినట్టన్పించింది.

కష్టపడి బతకటం రసూల్‌కి అచ్చిరాలేదు. ఎట్లా బతకాలనేది చిన్న బుర్రలో కలిగిన పెద్ద ప్రశ్న. ఆకలి మనిషిని మెలికలు తిప్పేస్తోంది. తన దగ్గర తెలివి వుంది. డబ్బుల్లేవు.

ఏ పనీ దొరకటం లేదు.మరి డబ్బులెట్లా? ఆకలి తీర్చుకునేదెట్లా? - చివరికో ఆలోచన మెరుపులా మెరిసింది.

'చెవి'లేకుండా తనకు సైకిలుతాళం తీసే విద్య వచ్చు. సైకిల్ షాపులో పని చేసేటప్పుడు తీగతో సైకిల్ తాళాలు తీయటం నేర్చుకున్నాడు.

ఇప్పుడావిషయం గుర్తుకొచ్చి ఓ కొట్టు ముందున్న సైకిలు తాళం రోడ్డు మీద దొరికిన ఇనుప తీగెతో సునాయాసంగా తీసి ఆ సైకిలు మీద అక్కడ్నించి వుడాయించాడు రసూల్.

పాత ఇనుప సామాన్ల అమ్మే దుకాణంలో ఆ సైకిలు అమ్మేసాడు. సైకిలు పాతది కావటంతో దాని ఖరీదు కింద ఒక వంద రూపాయలు చేతిలో పెట్టాడు షాపు యజమాని.

ఊరికే వచ్చింది ఎంతైతేనేం? అనుకుని నేరుగా హోటల్‌కెళ్లి కడుపునిండా కావలసినవి తిని ఆకలి తీర్చుకున్నాడు. ఆకలి ఖర్చుపోగా జేబులో యాభై రూపాయలే మిగిలాయి.

సైకిల్ దొంగతనాలకు అలవాటు పడిన రసూల్ ఆదాయం బాగానే వుంది. జల్సాగా రోజులు గడిపేస్తున్నాడు.

ఒక రోజు ఎంతకీ తాళం రాకపోవడంతో దొరికి పోయాడు. సైకిల్ ఓనరు రసూల్‌ని చావగొట్టాడు. పోలీసులకు పట్టిస్తానని బెదిరించాడు. ఆ పని చెయ్యవద్దంటూ రసూల్ ఓనరు కాళ్లా వేళ్లా పడ్డాడు. జాలిపడి వదిలివేయటంతో బతుకు జీవుడానుకుంటూ పరుగెత్తి ఎటో పారిపోయాడు. ఓనరు కొట్టిన దెబ్బలతో వళ్లంతా హూనమైంది. తన్నుల బాధకి ఏడుపొచ్చింది. అమ్మ అబ్బ గుర్తుకొచ్చారు. అంతలో పౌరుషం అడ్డొచ్చింది. తను ఎన్ని బాధలు పడినా ఇంటికి వెళ్లకూడదని నిర్ణయించుకున్నాడు రసూల్.

సైకిల్ దొంగతనాలకు ఫుల్‌స్టాప్ పెట్టి పిక్ పాకెటింగ్ వృత్తి మొదలు పెట్టాడు. పేవ్‌మెంట్ మీద తారస పడిన మరో జులాయి జేబులు ఎలాకత్తిరించి పర్స్‌లు కొట్టేయాల్సింది నేర్పాడు. నేర్చుకున్న విద్యతో స్వతంత్రంగా పిక్‌పాకెటింగ్ చేస్తూ పొట్ట పోసుకుంటున్నాడు.

దురదృష్టం! జేబులు కొడుతూ పోలీసుకు దొరికి పోయాడు. పర్స్‌లో డబ్బు కానిస్టేబులు నొక్కేసి రసూల్‌ని లాక్కెళ్లి లాకప్‌లో పడేసాడు. కుయ్యోమొర్రో అని మొత్తుకోగా ఎస్సై దయతలచి వదిలేసాడు.

హమ్మయ్య బతుకు జీవుడానేసి పోలీస్ స్టేషన్లోంచి బైట పడిన రసూల్‌కి మళ్లీ ఏం పని చేసి బ్రతకటమని తీవ్రంగా ఆలోచించాడు.

ఈ సారి ఛైన్ స్నాచింగ్‌కి శ్రీకారం చుట్టాడు. బస్సుల్లో... రష్‌గా వుండే ప్రదేశాలను ఎంచుకుని 'నేకగ' ఆడ వాళ్ల మెడలో గోల్డ్ చైన్స్ కొట్టేయటమే వృత్తిగా ఎంచుకున్నాడు. ఈ బిజినెస్ బావుందనిపించింది. డబ్బు బాగానే గిడుతోంది!

ఏడాది గడిచే సరికి బేంక్ అకౌంట్లో పాతిక వేలకు పైగా జమయింది.

ఈపనికీ చుక్కెదురై ఎస్సైకే దొరికిపోయాడు రసూల్.

కోర్టు ఆరు వారాల శిక్ష విధించింది. ఈ అరు వారాల కాలంలో జైల్లో పొగైన మిత్ర బృందం దగ్గర డూప్లికేట్ కీస్‌తో ఇళ్ల తాళాలు తియ్యటం నేర్చుకున్నాడు.

మనసులు కలిసిన నలుగురూ ఏకమై ఒక గ్రూపుగా ఏర్పడి జైల్లోంచి విడుదల అయిన రోజు నుంచే తాళం వేసిన ఇళ్లు వెతికి... ఇంట్లోకి జొరబడి డబ్బు నగనట్రా... సెల్‌ఫోన్లు... ఖరీదైన వస్తువులను దోచుకోవటం... దొంగిలించిన దాన్ని నలుగురూ పంచుకుంటూ ప్రొఫెషన్ దొంగలుగ తయారైనారు.

పోలీసులకు దొరక్కుండా రెండేళ్లపాటు ఇళ్ల' రాబరీలుచేస్తూ బాగానే సంపాదించిన డబ్బు బేంకు ఎకౌంట్లో వేసుకోగలిగేడు రసూల్.

ఈ విధమైన దొంగతనాలు నచ్చక పోవడంతో షట్టర్స్ ఎత్తేసి అద్దాలు పగులగొట్టి బంగారు నగలు షాపులు దోచుకోవటం షురూ చేసాడు. కాజేసిన సొమ్ము ముంబైతీసుకెళ్లి అమ్మిడబ్బు

చేసుకుని తిరిగి రావటం దిన చర్య అయింది.

పోలీసులు రసూల్ బృందంకోసం వెంటాడుతున్నారనే విషయం గ్రహించి కొన్నాళ్లు అండర్ గ్రౌండ్లోకి వెళ్లాడు.

ఓ ఏడాది కాలం తర్వాత అజ్ఞాతంలోంచి బైటికొచ్చిన నలుగురూ మిత్రులూ... ఈ సారి తమ దృష్టి బ్యాంక్‌లు దోచుకుంటే పెద్ద ఎత్తున లాభపడచ్చనే నిర్ణయానికొచ్చి అందుక్కావలసిన సామగ్రి కొన్నారు.

ఓ కాలనీలో జనసంచారానికి దూరంగా వున్న బేంకుని టార్గెట్‌గా ఎంచుకున్నారు. నాలుగు రోజుల పాటు 'రెక్కీ' నిర్వహించారు.

పథకం ప్రకారం ఇద్దరు బ్యాంక్ బిల్డింగ్ రూఫ్ మీద కెళ్లి డ్రిల్లింగ్ మెషీన్‌తో స్లాబ్ ధ్వంసం చేసి ఇనుప రాడ్స్ కట్‌చేసి తాళ్ల సాయంతో లోపలికి దిగారు. వెంట తెచ్చుకున్న పరికరాలనుపయోగించి ఎంతో కష్టపడి లాకర్ తెరిచారు. రెండు సంచుల నిండా నోట్ల కట్టల్ని లాకర్లోంచి బైటికి తీసి సర్దుకుని తాడు సాయంతో టెర్రేస్ మీదికొచ్చి డాబా దిగి వెంట తెచ్చుకున్న మారుతీలో పారిపోయారు.

కాజేసిన డబ్బు పంచుకోగా తలాయాభై లక్షలు ఒక్కొక్కరికి రావటంతో తృప్తిగ నవ్వుకుని నలుగురూ విడిపోయి ఎవరిదారిన వారు వెళ్లి పోయారు.

ఈ విధంగా సంపాదించిన డబ్బుతో తప్పుడు పాస్‌పోర్ట్ సంపాదించగలిగిన రసూల్ దుబాయ్‌కి విమానంలో చెక్కేసాడు.

అంతపెద్ద బేంక్ రాబరీ కేసులో నిందితులను పోలీసులు పట్టుకోలేక పోయారని పత్రికలు గేలి చేస్తూ విమర్శించాయి. పోలీసు కుక్కలు క్లూస్ టీమ్‌లు ఆనవాళ్లు పసికట్టలేక పోయాయి. ఇంత చాకచక్యంగా దోపిడీ జరగటం రాష్ట్రంలోనే కాదు దేశంలో నే ప్రథమమైనదిగా గుర్తించి నేరస్తులను పట్టుకున్నవారికి యాభైలక్షలు రివార్డ్ ప్రకటించటమూ జరిగింది.

దుబాయ్‌లో రసూల్ నాలుగేళ్ల పాటు వున్నాడు. అక్కడ తన తెలివితేటలు అక్కరకు రాలేదు. భారీ ఎత్తున దొంగతనాలకు పాల్పడలేకపోయాడు.ఒకవేళ సాహసం చేసినా దొరికి పోతే అక్కడి న్యాయవ్యవస్థ తనకు నిర్దాక్షిణ్యంగా 'ఉరి'శిక్ష విధిస్తుందనే భయంతో మౌనం వహించాడు.

దుబాయ్‌లో వున్నన్నాళ్లూ విలాసవంతమైన జీవితాన్ని గడుపుతూ వచ్చాడు. ఏ పనీచేయకుండా చేతులు ముడుచుకు కూర్చోవటం మనస్కరించక బంగారం వ్యాపారం ముసుగులో దొంగ బంగారాన్ని కొనుగోలు దారులకు అంటగట్టి పట్టుబడకుండా బాగానే ఆర్జించాడు.

రసూల్‌కి ఏం అనుమానం వచ్చిందో ఏమో... రాత్రికి రాత్రి దుబాయ్ విడిచి ఇండియా కొచ్చాడు. కస్టమ్స్ వారికి చిక్కకుండా గోల్డ్‌బిస్కెట్లు సూట్‌కేస్ నిండా వెంట తెచ్చుకోగలిగిన రసూల్

అడ్డదారుల్లో హైదరాబాద్ చేరుకుని ఐదు నక్షత్రాల హోటల్లో బసచేసాడు.

జంటనగరాల్లో అడుగుపెట్టగానే తల్లి తండ్రి తోడబుట్టిన వాళ్లు గుర్తు కొచ్చారు. వెంటనే వాళ్లని చూచేటందుకు టాక్సీలో బయల్దేరాడు.

తనవెవ్వరూ గుర్తించే స్థితిలో లేరు. పాతికేళ్ల ప్రాయం. పిల్లిగడ్డం...కత్తిరించని మీసకట్టు.. పెరిగి మెడని తాకే పొడవాటి జుట్టు....మెడలో పలుపుతాడంత బంగారు చైను... చేతి పదివేళ్లకి బంగారు ఉంగరాలు.. మనిషి కాస్ట్లీగా అవుపిస్తున్నాడు.

కార్లో తీరా తన కుటుంబం వున్న ప్రాంతానికి చేరుకున్నాడు. అతి కష్టం మీద ఇంటిని గుర్తించి పోల్చుకోగలిగాడు. కానీ వారక్కడ లేరని... అఫిదీ అతని భార్యలు చనిపోయారని... తమ్ముళ్ల జాడ తెలీదని ఇరుగుపొరుగు చెప్పగావిన్న రసూల్ హృదయం ద్రవించింది. కన్న వారిని చూడలేక పోయినందుకు బాధపడ్డాడు. చెమర్చిన కళ్లను కర్చీఫ్‌తో అద్దుకున్నాడు. నిరాశతో టాక్సీలో తిరిగి తాను బస చేసిన స్టార్ హోటల్ చేరుకున్నాడు.

★★★★★

ఇప్పుడు వెనుకటి రసూల్ కాదు.

సిటీ నడిబొడ్డున వేయి చదరపు గజాల స్థలం కొన్నాడు. అక్కడ అత్యంత విలాసవంతమైన 'విల్లా' కట్టించాడు. ఇంటిని నాలుగు ఫారిన్ బ్రీడ్ డాగ్స్ కాపలా కాస్తుంటాయ్. నలుగురు సెక్యూరిటీ గార్డ్స్‌ని నియమించాడు. బెంజికారు కొన్నాడు.

హయ్యర్ సర్కిల్స్‌తో పరిచయం... రాజకీయ నాయకులతో స్నేహం... విల్లాలో అతిథులకు విందులు వినోదాలు...ఓహ్! జీవితాన్ని పైలాపచ్చీస్‌గ గడుపుతున్నాడు.

రసూల్‌ని పెళ్లాడటంకోసం అందమైన వనితలు బారులు తీరి క్యూ కడుతున్నారు. నచ్చిన అమ్మాయితో వివాహం అంగరంగ వైభోగంగా జరిగింది.

రసూల్ ఒక ఇంటి వాడైనాడు!

ఒక రోజు శ్రీమతితో సరసాలాడుతూ మద్య మధ్య 'మద్యం' సేవిస్తూ... చేతిలో రిమోట్‌తో టి.వి. ప్రోగ్రాం చూస్తున్నాడు.

ఒక ఛానెల్లో చిత్రమైన ప్రకటన రసూల్ కళ్లబడింది. చేతిలో వున్న షాంపైన్ గ్లాసు పక్కనేవున్న టీపాయ్ మీదవుంచి ప్రకటనలో వివరాలను చెవులు రిక్కించి వింటున్నాడు.

వావ్! వాట్ ఎ వండర్!

చోరవృత్తిలో అత్యంత నిపుణులైనవారికి 'గిన్నీస్‌బుక్' వారు అయిదు కోట్లు బహుమతి ఇస్తామంటూ వివరాలతో కూడిన బయోడెటాను వెంటనే పంపుకోవలసిందిగా అమెరికా ఎంబెసీ ద్వారా వెలువడిన టి.వి.యాడ్ చూచి నివ్వెర పోయాడు రసూల్.

చోరవిద్యలో తనను మించిన వాడు ఈ ప్రపంచంలోనే వుండడన్పించటంతో వెంటనే

పి.ఏ.ని పిల్చి గిన్నీస్ వారు కోరిన విధంగా బయోడెటా తయారు చేసి ఈ మెయిల్ పంపమన్నాడు.

చోరవృత్తి ప్రారంభించినప్పటి నుండి ఇప్పటి వరకు పర్సనల్ బయోడెటా అంతా సి.డి. రూపంలో వుండటంతో బయోడెటా ప్రిపేర్ చేయటం పి.ఏ.కి సులువైంది.

బాస్ చోరకళ వివరాలను ఇంటర్‌నెట్ ద్వారా'గిన్నీస్‌బుక్' వారికి కమ్యూనికేట్ చేయటం జరిగింది.

ప్రపంచం నలు మూలల నుండి చోర వృత్తిలో నిష్ణాతులైన ఘరానా దొంగల వివరాలు శరపరంపరలుగా వచ్చిన వాటిని పరిశీలించిన అనంతరం కమిటీ సభ్యులంతా రసూల్ అనే భారతీయుడు దొంగతనాల్లో దిట్ట అని భావించి అతనికే అయిదు కోట్ల రూపాయలు బహుమతిని ఇవ్వాలని తీర్మానించారు.

విన్నర్ 'రసూల్' అనే వార్త క్షణాల్లో ఎలక్ట్రానిక్ మీడియా వారికి తెలిసిపోయింది! ఇంకేముంది అభినందనలు వెల్లువెత్తినయ్. సెల్ ద్వారా కాల్స్ ఆన్సర్ చేయలేక తెగ ఇబ్బంది పడి పోతున్నాడు రసూల్.

మరుసటి రోజే న్యూస్ అన్ని దినపత్రికల్లో వచ్చేసింది.

అయిదు కోట్లు తనపరం కాబోతున్నందుకు రసూల్ ఉక్కిరి బిక్కిరవుతున్నాడు. అదృష్టమంటే తనదే! తాను లక్కీఫెలో!! తనకు విశ్వ విఖ్యాతి ఖ్యాతి లభించినందుకు మనిషి వుప్పొంగి పోతున్నాడు.

ఈ విషయాన్ని సవివరంగా తెల్సుకుని నిజానిజాలను అధ్యయనం చేసిన రాష్ట్ర పోలీసు అధికారులు రసూలే లోగడ అనేకానేక దొంగతనాలకు పాల్పడి దొరక్కుండా పోయినవ్యక్తిగా నిర్ధారించుకున్నారు. బేంకు రాబరీ కేసులోనూ ఇతని హస్తముందని కన్ఫరమ్ చేసుకున్నారు.

తగిన ఆధారాలు చేజిక్కించుకున్న పోలీసు యంత్రాంగం రసూల్‌ని అరెస్ట్ చేసి కస్టడీలోకి తీసుకోవటానికి అత్యంత రహస్యంగా ఏర్పాట్లు వడివడిగ చేసింది.

తాము చివరికి ఈ విధంగా నైనా నేరస్తుడు రసూల్‌ని పట్టుకో గలిగినందుకు రాష్ట్ర ప్రభుత్వం సంతోషించింది!

మనసులో ఆనందం కదం తొక్కుతున్న మధుర క్షణాల్లో రసూల్ చేతికి బేడీలు పడినయ్! అందుకు రసూల్ బాధపడలేదు. ధైర్యంగా కోర్టులో నేరాలను ఒప్పుకున్నాడు. గిన్నిస్‌బుక్‌లో కెక్కినందుకు తాను మనసులో మురిసాడుచోరకళతో చరిత్ర సృష్టించిన రసూల్!!

-:(సమాప్తం):-